క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే శంబంగి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజ్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని 11వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి నేతలు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

బొబ్బిలి పీఏసీఎస్ అధ్యక్షుడిగా అప్పలనాయుడు



ఎమ్మెల్యే శంబంగి చేతులమీదుగా నియామక ఉత్వర్వులు అందుకుంటున్న బొబ్బిలి పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలనాయుడు

బొబ్బిలి: బొబ్బిలి పీఏసీఎస్(ప్రాథమిక సహకార పరపతి సంఘం) అధ్యక్షుడిగా బొమ్మి అప్పలనాయుడు, కోమటపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా వంగపండు శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక పట్టణంలో వారికి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉండి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

బొబ్బిలి: మండలంలోని గొల్లపల్లి, బొబ్బిలి, కలువరాయి, పిరిడి, బలిజిపేట, జగన్నాథపురం, పెంట, పినపెంకి గ్రామాల్లో ఈ నెల 16వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, బాధిత గ్రామాల ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

15న న్యాయవిజ్ఞాన సదస్సు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో ఉన్న సృజన విద్యాలయంలో ఈ నెల 15వ తేదీన న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, పౌరుల ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన కల్పించనున్నామన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గౌరి, అన్వర్ భాషా, రియాజ్ ఖాన్

బాడంగి: రంజాన్ పురస్కరించుకుని, స్థానిక మసీదు సమీపంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అన్వర్ భాషా, బొబ్బిలి మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ కలిసి వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు

బొబ్బిలి: స్థానిక పట్టణ పరిధిలోని 14వ వార్డు, సింగారపు వీధిలో అగ్నిప్రమాద బాధితులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు శుక్రవారం కలిసి, పరామర్శించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా గురువారం అక్కడ జరిగిన అగ్నిప్రమాదంలో పతివాడ తిరుపతిరావు ఇల్లు, ఇంట్లోని విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కౌన్సిలర్లు సీర శ్రీలక్ష్మి, చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గొప్ప సంఘసంస్కర్త



రాజాం సిటీ: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. అంటరానితనాన్ని నిర్మూలించి, సమానత్వాన్ని చాటిచెప్పిన గొప్ప సంఘసంస్కర్త అంబేడ్కర్ అని, ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అహర్నిశలు శ్రమించారని, ఆయన బాటలో మనమంతా నడిచి ఆదర్శవంతులుగా నిలవాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి: కృష్ణాపురంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు, గ్రామపెద్దలు



బొబ్బిలి: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రాజారావు



బాడంగి: గ్రంథాలయంలో జరిగిన అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న జెడ్పీటీసీ రామారావు



వంగర: లక్ష్మీపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, ఎస్‌ఐ లోకేశ్వరరావు



వంగర బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్ ఐజాక్



తెర్లాంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



బాడంగి: హరిజన పాల్తేరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



మెంటాడ: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు, తదితరులు



సంతకవిటిలో అంబేడ్కర్ జయంతిలో నాయకులు, అధికారులు



రాజాం: మారేడుబాకలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్



రాజాం: కంచరాంలో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి



తెర్లాం: తహసీల్దారు కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బొబ్బిలి ఆర్‌డీఓ శేషశైలజ, తహసీల్దార్ రాజేశ్వరరావు



రేగిడి: ఏపీపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ



మెంటాడ: ఆగూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



రామభద్రపురం: పోలీస్‌స్టేషన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ సురేంద్ర నాయుడు, సిబ్బంది



రామభద్రపురం: కొట్టక్కిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వలసల నివారణకే 'ఉపాధి' పనులు



రాజాం సిటీ: అంతకాపల్లిలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ సాయిరాం

రాజాం సిటీ: గ్రామీణ ప్రాంత ప్రజల వలసల నివారణకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో పనులు కల్పిస్తున్నాయని ఎంపీడీఓ బాసూరి శంకరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని అంతకాపల్లి, వీఆర్ అగ్రహారం, పొగిరి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని సూచించారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రతిఒక్కరూ వాటర్ బాటిల్ వెంట తీసుకురావాలని, పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశిత కొలతల్లో నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేస్తే రూ.272 వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం, జేఈ నరేంద్ర, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ జగదీశ్వరరావు శుక్రవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలన్నారు. పని ప్రదేశంలో క్షేత్ర సహాయకులు టెంట్లు ఏర్పాటు చేయాలని, టెంట్లు లేని పక్షంలో తాటాకులతో చిన్న పందిరి వేసుకోవాలన్నారు. వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని అంబకండి, సోమరాజుపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ ఎస్.హరనాధరావు శుక్రవారం పరిశీలించారు. జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే పనులకు అనుమతించాలని, ఒకరి పేరు మీద మరొకరు పని చేసేందుకు వీలు లేదన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సోమరాజుపేట సర్పంచ్ సవలాపురపు రమేష్‌నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



తెర్లాంలో జరుగుతున్న ఉపాధి పనులకు హాజరైన వేతనదారులు

బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే..



మాట్లాడుతున్న బీఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ సాంబయ్య

బొబ్బిలి: పాలనలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని బీఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ సోరు సాంబయ్య అన్నారు. స్థానిక తాండ్రపాపారాయ జంక్షన్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న ఆయన కేంద్రంలో పాలనా పగ్గాలు చేపట్టిన బీజేపీ, కాంగ్రెస్‌ల వైఖరిపై నిప్పులు చెరిగారు. ఆ రెండు పార్టీలూ మనువాద పార్టీలేనన్నారు. పేదల సంక్షేమం మరిచి, పెట్టుబడిదారులకు అండగా నిలిచే ఆయా పార్టీల ఉనికి లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మళ్లీ అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ తహతహలాడుతున్నారని, గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం మేలు చేశారని ప్రశ్నించారు. జనానికి మంచి చేసే పార్టీలను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎండ గోపాలరావు, విశ్రాంత తహసీల్దార్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

తెర్లాం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లతో శుక్రవారం సమావేశమైన ఆయన ప్రతీ రైతు భరోసా కేంద్రం పరిధిలో నిర్దేశించిన లక్ష్యం మేరకు వీఏఏలంతా రైతులతో నవధాన్యాలు సాగు చేయించాలని తెలిపారు. నవధాన్యాలు సాగు చేస్తే నేల సారవంతమై, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం 30 రకాల విత్తనాల కిట్‌ను వీఏఏలకు చూపించి, వాటి సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ ఆరిపల్లి సింహాద్రినాయుడు, బొబ్బిలి డివిజన్ మాస్టర్ ట్రైనీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వీఏఏలకు సూచనలిస్తున్న ఏఓ సునీల్‌కుమార్

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

రాజాం సిటీ: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫైర్ ఎస్‌ఐ టీఎస్ఎస్ జనార్దనరావు మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయని, కార్యక్రమంలో భాగంగా పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు 1944లో జరిగిన ప్రమాద ఘటనలో మృతి చెందిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ఓ వై.గోవిందరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని డొంకినవలస ఫైర్‌స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాలను జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఫైర్ ఆఫీసర్ జి.రామినాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగే ఈ వారోత్సవాల్లో పలు ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని జెడ్పీటీసీ రామారావు తెలిపారు. కార్యక్రమంలో లీడ్ ఫైర్ ఆఫీసర్ త్రినాధ తదితరులు పాల్గొన్నారు.



అమరులకు నివాళులర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలు వివరించారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



రేగిడి: సంకిలిలో మా నమ్మకం నువ్వే జగన్ అని స్టిక్కర్లు చూపిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



రాజాం: బొమ్మినాయుడువలసలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు



సంతకవిటి: చింతలపేటలో ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికిస్తున్న పార్టీ అభిమానులు



బాడంగి: ముగడలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న గృహసారథులు, వలంటీర్లు



తెర్లాంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు



రామభద్రపురం: కొట్టక్కిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు



బొబ్బిలిలో ఏడో వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్ సునీత



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్ రావు ప్రచారం

సమావేశానికి అధికారులంతా హాజరు కావాలి

రేగిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి హాజరు కానున్నారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

అన్నదానం



బొబ్బిలి: పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న అన్వర్ భాషా, రియాజ్ ఖాన్

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ ఐటీ రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అయ్యప్పస్వామి పుట్టిన రోజు పురస్కరించుకుని, ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పొట్నూరు లక్ష్మణరావు, పోరాపు రాము, కెంబూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: రంజాన్ పురస్కరించుకుని, స్థానిక పట్టణంలోని మసీదు ఎదురుగా ఉన్న యాచకులు, నిరుపేదలకు వైఎస్సార్ సీపీ నాయకుడు అన్వర్ భాషా, బొబ్బిలి మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ ఆహార పొట్లాలు వితరణ చేశారు. పేదవారికి అన్నదానం చేయడం చాలా ఆనందంగా ఉందని దాతలు అన్నారు.